క్లుప్తంగా

రక్తదానం.. ప్రాణదానంతో సమానం


రక్తదానం చేస్తున్న గుండ్ల రాజేష్‌

హుజూర్‌నగర్‌ : రక్తదానం ప్రాణదానంతో సమానమని డీఎస్‌ఆర్‌ ట్రస్ట్‌ చైర్మన్‌ బాబూరావు అన్నారు. శుక్రవారం ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని రక్తం అవసరమైన గర్భిణి అనూషకు డీఎస్‌ఆర్‌ ట్రస్ట్‌ ఆధ్వర్యంలో గుండ్ల రాజేష్‌ రక్తదానం చేశారు.

'మైహోం'లో రక్తదాన శిబిరం

మేళ్లచెరువు : ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా మేళ్లచెరువు మండల కేంద్రం పరిధిలోని మైహోం సిమెంట్‌ పరిశ్రమలో శుక్రవారం కోదాడలోని తిరుమల హాస్పిటల్‌ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ప్లాంట్‌ హెడ్‌ శ్రీనివాసరావు, పర్సనల్‌ జీఎం నాగేశ్వరరావు, డాక్టర్‌ సాయికిరణ్‌, ఏజీఎం శ్రీనివాస్‌ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఎంఎంఎస్‌కు విద్యార్థుల ఎంపిక


ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

మునగాల : మండల కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాలకు చెందిన విద్యార్థులు ఎస్‌.ఉదయ్‌, వి.వెంకటమోహిత్‌, డి.ఉషావర్షిణిలు జాతీయ స్థాయిలో నిర్వహించిన నేషనల్‌ మీన్స్‌ కమ్‌ మెరిట్‌ స్కాలర్‌షిప్‌ (ఎన్‌ఎంఎంఎస్‌)కు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్‌ మద్దూరి సాయిఈశ్వరి శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులను ఉపాధ్యాయులు పాఠశాలలో అభినందించారు.

ఎంఈఓ విచారణ

హుజూర్‌నగర్‌ : చింతలపాలెం పరిధిలోని సీతా పబ్లిక్‌ స్కూల్‌పై వచ్చిన ఆరోపణలపై మండల విద్యాధికారి సైదానాయక్‌ శుక్రవారం విచారణ జరిపారు. స్కూల్‌కు సంబంధించి పలు అవకతవకలు జరిగాయని గ్రామానికి చెందిన పలువురు అధికారులకు ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. దీంతో శుక్రవారం స్కూల్‌ రికార్డులను ఎంఈఓ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్కూల్‌పై ఆరోపణల నేపథ్యంలో యాజమాన్యానికి నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. మూడు రోజుల్లో బిల్డింగ్‌ నిర్మాణ అనుమతులు, ఫీజులకు సంబంధించిన అన్ని ధృవపత్రాలతో వివరణ ఇవ్వాలని ఆదేశించినట్లు తెలిపారు.

ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణానికి స్థల పరిశీలన

హుజూర్‌నగర్‌ (చింతలపాలెం) : చింతలపాలెం మండల కేంద్రంలో ప్రభుత్వ కార్యాలయాల భవనాల నిర్మాణం కోసం స్థలాన్ని శుక్రవారం తహసీల్దార్‌ సురేందర్‌రెడ్డి పరిశీలించారు. పోలీసు స్టేషన్‌, తహసీల్దార్‌, ఎంపీడీఓ కార్యాలయాల భవనాల నిర్మాణానికి సర్వే నంబర్‌ 24లో గల 9.15 ఎకరాల స్థలాన్ని ఆయన పరిశీలించారు. నివేదికను ఉన్నతాధికారులకు పంపనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్‌ అసిస్టెంట్‌ గాలి శ్రీనివాస్‌, నాయకులు ఎస్‌.కొండారెడ్డి, ఎస్‌.ఇంద్రారెడ్డి, సీహెచ్‌.శ్రీనివాసరెడ్డి, నరేందర్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మిషన్‌ భగీరథ నీటి సరఫరాపై ఇంటింటి సర్వే

నడిగూడెం : మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో మిషన్‌ భగీరథ నీటి సరఫరాపై సర్వే కొనసాగుతోంది. శుక్రవారం గ్రామాల్లో పలువురు అధికారులు, పంచాయతీ కార్యదర్శులు ఇంటింటికి తిరుగుతూ మిషన్‌ భగీరథ నీళ్లు వస్తున్నాయా, లేదా అని ప్రజలను వివరాలు అడిగి తెలుసుకుని మొబైల్‌ యాప్‌లో నమోదు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ఎస్‌డి.ఇమామ్‌, డాక్టర్‌.బి.అఖిల, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

28న కూచిపూడిలో సుదర్శన హోమం


యాదగిరిగుట్ట ప్రధాన అర్చకుడిని సన్మానిస్తున్న కూచిపూడి గ్రామస్తులు

కోదాడరూరల్‌ : మండల పరిధిలోని కూచిపూడిలో గల శ్రీభక్తరామంజనేయ లక్ష్మీనర్సింహ వానర మారుతి దివ్యక్షేత్రం వద్ద ఈ నెల 28న సుదర్శన హోమం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు కందికొండ సాయిబాబు తెలిపారు. శుక్రవారం యాదగిరిగుట్ట ప్రధాన అర్చకులు లక్ష్మీనర్సింహచార్యులును కలిసి సలహాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయనను సన్మానించారు. సాయిబాబు స్థానిక విలేకరులతో మాట్లాడారు. యాదగిరిగుట్ట ప్రధాన అర్చకుడి సూచనలతోనే ఈ హోమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ హోమంలో లక్ష్మీనర్సింహాచార్యులతో పాటు పలువురు అర్చకులు పాల్గొంటారని తెలిపారు. అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

వైభవంగా ఆలయాల వార్షికోత్సవం


గరిడేపల్లి : కీతవారిగూడెంలో బోనాలతో ఆలయానికి వెళ్తున్న మహిళలు


గరిడేపల్లి : కోనాయిగూడెంలో..

గరిడేపల్లి : మండల పరిధిలోని కీతవారిగూడెం గ్రామంలో శ్రీ కంఠమహేశ్వర, సురమాంబ ఆలయ వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కౌండిన్యగౌడ సంఘం సభ్యులు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు జలబిందెలతో స్వామివారికి అభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గౌడ సంఘం పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

కోనాయిగూడెంలో..

గరిడేపల్లి : మండల పరిధిలోని కోనాయిగూడెం గ్రామంలో గల శ్రీ కనకదుర్గమ్మ, అంకాలమ్మ దేవతలు, పోతరాజుస్వామి విగ్రహాలు ప్రతిష్ఠించి ఏడాది పూర్తయిన సందర్భంగా శుక్రవారం ప్రథమ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు బోనాలు ఎత్తుకొని ప్రదర్శనగా వెళ్లి అమ్మవారికి సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అర్చకులు రాయప్రోలు శ్రీరామయ్యశర్మ ఆధ్వర్యంలో అమ్మవార్లకు అభిషేకం, సహస్రనామార్చన, విశేష పుష్పాలంకరణ, నిరాజన మంత్రపుష్పం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామపెద్దలు, యువకులు, మహిళలు పాల్గొన్నారు.


మునగాల : బొడ్రాయికి బోనాలు సమర్పిస్తున్న గ్రామస్తులు


బోనంతో వస్తున్న యువతి

ముకుందాపురంలో బొడ్రాయి వార్షికోత్సవం

మునగాల : మండలంలోని ముకుందాపురంలో బొడ్రాయి ప్రతిష్ఠించి ఏడాది పూర్తయిన సందర్భంగా శుక్రవారం వార్షికోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు బొడ్రాయికి జలాభిషేకం చేశారు. మహిళలు బోనాలతో తరలివచ్చి బొడ్రాయికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ వేడుక సందర్భంగా గ్రామంలో పండుగ వాతావరణం నెలకొన్నది. ఆడపడుచులు, బంధువులతో గ్రామం కళకళలాడింది. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పురోహితుడు వారణాసి భాస్కర్‌ శర్మ, గ్రామస్తులు పాల్గొన్నారు.

పాఠ్య పుస్తకాలు, యూనిఫాం పంపిణీ


భీల్యానాయక్‌తండాలో విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు పంపిణీ చేస్తున్న అధికారులు

మఠంపల్లి : మండలంలోని భీల్యానాయక్‌తండాలో గల జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నూతన విద్యాసంవత్సర ప్రారంభ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కొబ్బరి, మామిడి తోరణాలతో పాఠశాలను అలంకరించారు. తహసీల్దార్‌ మంగారాథోడ్‌, ఎంపీడీఓ ఎం.జానకిరాములు, ఎంఈఓ చత్రునాయక్‌లు ముఖ్య అతిథులుగా హాజరై విద్యార్థులకు యూనిఫాం, పాఠ్య, నోట్‌ పుస్తకాలు పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. మండల నోడల్‌ అధికారి వేణుగోపాల్‌, అల్లీపురం కాంప్లెక్స్‌ హెచ్‌ఎం శేషిరెడ్డి, ఏపీఎం సౌజన్య, హెచ్‌ఎంలు దుర్గాప్రసాద్‌, చంద్రశేఖర్‌, సీఆర్‌పీ నాగమణి, ఐఈఆర్‌పీ రంగారావు, ఏఏపీసీ చైర్మన్‌లు, సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాజగోపుర నిర్మాణానికి రూ.55 లక్షలు మంజూరు

హుజూర్‌నగర్‌: హుజూర్‌నగర్‌ నియోజకవర్గంలోని మేళ్లచెరువు మండల కేంద్రంలో గల శ్రీ స్వయంభు శంభులింగేశ్వర స్వామి ఆలయం రాజగోపురం నిర్మాణానికి రూ.55 లక్షలు మంజూరు చేస్తూ జిల్లా కలెక్టర్‌ వెంకటరావు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర మంత్రి ఉత్తమ్‌ కుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు మంజూరైన ఈ స్పెషల్‌ డెవలప్‌మెంట్‌ నిధులతో దేవాదాయ శాఖ అధికారుల పర్యవేక్షణలో ఆలయంలోని దక్షిణం వైపు రాజగోపురాన్ని నిర్మించనున్నారు.

చేప పిల్లలకు బదులు నగదు ఇవ్వాలి

హుజూర్‌నగర్‌: మత్స్యసొసైటీలకు చేప పిల్లలకు బదులు ప్రభుత్వం నగదు ఇవ్వాలని మత్స్యకార, మత్స్యకార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు శీలం శ్రీను కోరారు. శుక్రవారం హుజూర్‌నగర్‌లోని అమరవీరుల స్మారక భవనంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం నిర్వాకం వల్ల గత పదేళ్ల కాలంలో మత్స్యకారులు ఉపాధి కోల్పోయారని ఆరోపించారు. మత్స్య సొసైటీలకు నాణ్యమైన చేప పిల్లలు కాకుండా నాసిరకం చేపపిల్లలను చెరువుల్లో పోయటంతో సరైన దిగుబడి రాక సొసైటీలు అప్పుల పాలయ్యాయన్నారు. నాసిరకం చేప పిల్లలను పంపిణీ చేయడంతో కాంట్రాక్టర్లు బాగుపడ్డారని, మత్స్య సొసైటీలు, చెరువుల మీద ఆధారపడి బతుకుతున్న కార్మికులు రోడ్డు మీద పడ్డారని తెలిపారు. ప్రస్తుత కాంగ్రెస్‌ ప్రభుత్వమైనా మత్స్యకారులను ఆదుకోవాలని కోరారు. సొసైటీలకు చేప పిల్లలకు బదులు సొసైటీ అకౌంట్లో నగదు జమచేస్తే నాణ్యమైన చేప పిల్లలను పోసుకుంటారని పేర్కొన్నారు. మత్స్య కార్మికులు ప్రమాదంలో మరణిస్తే బాధిత కుటుంబాలకు రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలన్నారు. కబ్జాలకు గురవుతున్న చెరువులు, కుంటలను అధికారులు గుర్తించి పూర్తి స్థాయిలో హద్దులు ఏర్పాటు చేయాలని డిమాండ్‌ చేశారు.

ఫుట్‌పాత్‌లు ఆక్రమిస్తే చర్యలు


రోడ్డుపై ఉన్న తోపుడుబండ్లను తొలగిస్తున్న ట్రాఫిక్‌ ఎస్‌ఐ మల్లేష్‌, సిబ్బంది

కోదాడరూరల్‌ : వీధి వ్యాపారులు ఫుట్‌పాత్‌లను ఆక్రమించి వ్యాపారాలు చేస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని ట్రాఫిక్‌ ఎస్‌ఐ మల్లేష్‌ హెచ్చరించారు. కోదాడ పట్టణంలోని పలు చోట్ల ఫుట్‌పాత్‌లపై ఏర్పాటు చేసిన దుకాణాలను శుక్రవారం తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫుట్‌పాత్‌లను ఆక్రమిస్తే పాదచారులు రోడ్డుపై నడవాల్సి వస్తుందని, దీంతో ప్రమాదాలు చోటు చేసుకుంటాయని అన్నారు. వ్యాపారులు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించవద్దని కోరారు. ఆయన వెంట సిబ్బంది ఏఎస్‌ఐ వెంకటేశ్వర్లు, హెడ్‌ కానిస్టేబుల్‌ ఖయ్యూం, శేఖర్‌రెడ్డి ఉన్నారు.

పీడీఎస్‌ బియ్యం స్వాధీనం


పట్టుబడ్డ పీడీఎస్‌ బియ్యం

పాలకవీడు: అక్రమంగా పీడీఎస్‌ బియ్యం తరలిస్తున్న వాహనాన్ని పోలీసులు పట్టుకున్నారు. శుక్రవారం ఉదయం జాన్‌పహాడ్‌ సమీపంలో వాహనాలు తనిఖీ చేస్తున్న సమయంలో మఠంపల్లి మండలం నుంచి దామరచర్ల వైపు వెళ్తున్న బొలెరో వాహనాన్ని తనిఖీ చేయగా పీడీఎస్‌ బియ్యాన్ని గుర్తించినట్లు ఎస్సై లక్ష్మీనర్సయ్య తెలిపారు. వాహనంలో సుమారు 35 క్వింటాళ్ల బియ్యం ఉన్నట్లు చెప్పారు. డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నామని, వాహనాన్ని స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

ప్రత్యేక ప్రణాళికతో అభివృద్ధి చేయాలి


లాలితండాలో గ్రామ సభలో పాల్గొన్న అధికారులు, గ్రామస్తులు

మఠంపల్లి : ప్రత్యేక ప్రణాళికతో గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టాలని జెడ్పీటీసీ బానోతు జగన్‌నాయక్‌ అన్నారు. శుక్రవారం మండలంలోని బాడవాతండా, లాలితండా తదితర గ్రామ పంచాయతీల్లో గ్రామ సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో తాగునీరు, సాగునీటి సమస్య లేకుండా చూడాలని, పారిశుద్ధ్యం మెరుగు పరచాలని అన్నారు. విద్య, వైద్యానికి ఎలాంటి లోటు ఉండవద్దని తెలిపారు. అధికారుల సహకారంతో గ్రామస్తులు గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు గోవింద్‌నాయక్‌, బోడ్‌ రమేష్‌నాయక్‌, కార్యదర్శులు నాగిరెడ్డి, ఉమా, గ్రామస్తులు పాల్గొన్నారు.

శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలి

కోదాడ రూరల్‌: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన చట్టాలతో పాటు సాంకేతిక పరిజ్ఞానంపై ఆల్‌ఇండియా లాయర్స్‌ యూనియన్‌(ఐలు) ఆధ్వర్యంలో ఈనెల 15, 16 తేదీల్లో హైదరాబాద్‌లో నిర్వహించే శిక్షణ తరగతులను న్యాయవాదులు సద్వినియోగం చేసుకోవాలని ఐలు జిల్లా బాధ్యులు వెజెల్ల రంగారావు, ఉయ్యాల నర్సయ్య శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌లోని రంగారెడ్డి జిల్లా కోర్టు సముదాయంలో ఈ శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు, వీటిని ఐలు జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు బీకాస్‌ రంజన్‌ భట్టాచార్య ప్రారంభిస్తారని పేర్కొన్నారు. శిక్షణ తరగతులకు హాజరయ్యేవారు రూ.200 చెల్లించాలని, వసతి, భోజన సౌకర్యాలు నిర్వాహకులే కల్పిస్తారని తెలిపారు.

నల్లబెల్లం పట్టివేత


పోలీసులకు పట్టుబడ్డ నల్లబెల్లం తరలిస్తున్న ఆటో

పాలకవీడు: సారా తయారీకి ఉపయోగించే నిషేధిత నల్లబెల్లం తరలిస్తున్న వాహనాన్ని పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై లక్ష్మీనర్సయ్య తెలిపిన వివరాల ప్రకారం.. పాలకవీడు మండలంలోని శూన్యపహాడ్‌ శివారులో వాహనాలు తనిఖీ చేస్తుండగా ఆటోలో నల్లబెల్లం తరలిస్తున్నట్లు గుర్తించారు. ఆటో డ్రైవర్‌ అడావత్‌ బాలును అదుపులోకి తీసుకుని విచారించగా ప్రకాషం జిల్లా ఒంగోలు నుంచి బెల్లం రవాణా చేస్తున్నట్లు తెలిపాడు. ఆటోలో నాలుగు బస్తాల్లో 210 కేజీల నల్లబెల్లం ఉన్నట్లు తెలిపారు. ఈ మేరకు వాహనాన్ని స్టేషన్‌కు తరలించి బాలుపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.

విద్యుదాఘాతంతో ఆరు గేదెలు మృతి


మృతి చెందిన గేదెలు

అనంతగిరి : విద్యుదాఘాతంతో ఆరు గేదెలు మృతి చెందాయి. ఈ సంఘటన అనంతగిరి మండల పరిధిలోని కొత్తగూడెంలో చోటు చేసుకుంది. స్థానికులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. రోజూ మాదిరిగానే శుక్రవారం ఉదయం రైతులు గేదెలను మేత కోసం గ్రామశివారులోని పొలాల్లోకి వదిలారు. రైతు పొలంపల్లి రమేష్‌కు చెందిన బావి వద్ద ఏర్పాటు చేసిన స్తంభానికి గల విద్యుత్‌ తీగలు గేదెలకు తగలడంతో అవి అక్కడికక్కడే మృతి చెందాయి. మృతిచెందిన వాటిలో కొత్తగూడెం గ్రామానికి చెందిన వాడకొప్పుల ఉపేందర్‌వి రెండు గేదెలు, బట్టా బాబురావుది ఒక గేదె, వంక నర్సింహది ఒక గేదె, వాడకొప్పుల చిన్న రోశయ్యది ఒక గేదె, వంక ముత్తయ్యది ఒక గేదె ఉంది. ఒక్కో గేదే సుమారు రూ.50 వేలు ఉంటుందని బాధిత రైతులు తెలిపారు. సంఘటనా స్థలాన్ని శనివారం పరిశీలిస్తామని ఏఈ కీర్తిరెడ్డి తెలిపారు.

సీపీఎం శిక్షణ తరగతులను జయప్రదం చేయాలి

గరిడేపల్లి : మండల కేంద్రంలోని ఎల్బీ నగర్‌లో గల జిన్నారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి ఫంక్షన్‌ హాల్‌లో ఈ నెల 16న గరిడేపల్లి, నేరేడుచర్ల, పాలకీడు మండలాల సీపీఎం సభ్యులకు నిర్వహించబోయే రాజకీయ శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని సీపీఎం మండల కార్యదర్శి యాకూబ్‌ శుక్రవారం కోరారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ శాసన సభ్యుడు జూలకంటి రంగారెడ్డి, జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్‌రెడ్డి, కార్యదర్శి వర్గ సభ్యులు పారేపల్లి శేఖర్‌రావు, హాజరవుతున్నట్లు తెలిపారు. సభ్యులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

స్కూల్‌ బస్సులకు ఫిట్‌నెస్‌ టెస్టులు నిర్వహించాలి

హుజూర్‌నగర్‌ : స్కూల్‌ బస్సులకు రవాణా శాఖ అధికారులు ఫిట్‌నెస్‌ టెస్టులు నిర్వహించాలని బీజేపీ నాయకుడు కె.హరీష్‌ కోరారు. ఈమేరకు శుక్రవారం కోదాడ రవాణా శాఖ అధికారి జిలానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాల యాజమాన్యం నడిపే బస్సులు, మినీ బస్సులు, ఆటోలు తదితర వాహనాలు గత రెండు నెలలుగా వాడకపోవటంతో వాటికి సరైన ఫిట్‌నెస్‌ ఉండదని, వాటికి ఫిట్‌నెస్‌ టెస్టులు నిర్వహించాలని కోరారు. నిబంధనల ప్రకారం లేని వాహనాలను సీజ్‌ చేయాలని ఆయన కోరారు.

ఆస్పత్రి ఎదుట డబ్బాకొట్లు తొలగించాలని వినతి

మునగాల : మండల కేంద్రంలోని సివిల్‌ ఆసుపత్రి ఎదురుగా జాతీయ రహదారి పక్కన అనధికారికంగా ఏర్పాటు చేసిన డబ్బాకొట్లను తక్షణమే తొలగించాలని గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త అక్కినేపల్లి రవి కోరారు. ఈమేరకు శుక్రవారం గ్రామపంచాయతీ కార్యదర్శి ఫరీద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ.. రహదారి పక్కన డబ్బాకొట్లు ఏర్పాటు చేయడంతో హైదరాబాద్‌, సూర్యాపేట పట్టణాలకు వెళ్లే ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని, కనీసం కూర్చునేందుకు వీలులేకుండా పోయిందని వాపోయారు. గ్రామ పంచాయతీ అధికారులు డబ్బాకొట్లను ఖాళీ చేయిస్తే ఆ స్థలంలో బస్టాప్‌ షెల్టర్‌ ఏర్పాటు చేసేందుకు దాతలు ముందుకొచ్చే అవకాశముందన్నారు.

విద్యుత్‌ సమస్యను పరిష్కరించాలని వినతి


ట్రాన్స్‌కో ఏఈకి వినతిపత్రం అందజేస్తున్న నర్సింహులగూడెం గ్రామస్తులు

మునగాల : మండలంలోని నర్సింహులగూడెంలో గల దళితవాడలో విద్యుత్‌ సమస్యతో ఇబ్బందులు పడుతున్నామని తక్షణమే పరిష్కరించాలని దళితవాడకు చెందిన పలువురు శుక్రవారం మండల కేంద్రంలోని విద్యుత్‌ శాఖ కార్యాలయంలో ఏఈ వికాస్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ కాలనీకి అనేక ఏళ్లుగా వ్యవసాయ విద్యుత్‌ లైన్‌ నుంచే విద్యుత్‌ సరఫరా జరుగుతుందని, దీంతో గాలిదుమారాలు, వర్షం వచ్చినప్పుడు విద్యుత్‌ సరఫరాలో అంతరాయం కలుగుతుందని తెలిపారు. గురువారం కురిసిన వర్షం మూలంగా విద్యుత్‌ సరఫరా లేక రాత్రి మొత్తం కాలనీ ప్రజలు చీకట్లోనే గడపాల్సి వచ్చిందని వాపోయారు. కావున విద్యుత్‌ శాఖ అధికారులు స్పందించి తమ కాలనీకి ట్రాన్స్‌ఫార్మర్లు, కరెంట్‌ స్తంభాలు మంజూరు చేయాలని కోరారు. వీలైనంత త్వరగా దళితవాడకు అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాలు మంజూరు చేయించి విద్యుత్‌ సమస్యను పరిష్కరిస్తామని ఏఈ హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు సొంపంగు వెంకటేశ్వర్లు, నందిపాటి శేఖర్‌, పోకల వెంకన్న, పోకల రామయ్య, సొంపంగు వెంకన్న, ఎస్‌.వెంకటేశ్వర్లు, అంబేద్కర్‌, కాంపాటి ప్రశాంత్‌, పిడమర్తి ప్రశాంత్‌, పిడమర్తి శ్రావణ్‌ పాల్గొన్నారు.

మలిదశ ఉద్యమకారులకు పెన్షన్‌ ఇవ్వాలి


సమావేశంలో మాట్లాడుతున్న బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు శ్రీనివాస్‌

హుజూర్‌నగర్‌ : 50 ఏళ్లు నిండిన తెలంగాణ మలిదశ ఉద్యమకారులకు ప్రభుత్వం నెలకు రూ.5 వేల పెన్షన్‌ అందించాలని బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు ధూళిపాళ శ్రీనివాస్‌ కోరారు. శుక్రవారం హుజూర్‌నగర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర సాధనలో ఉద్యమాన్ని ఉరకలెత్తించిన అనేకమంది నేడు వయోభారం, ఆరోగ్య, ఆర్థిక ఇబ్బందులతో సతమతం అవుతున్నారని, వారందరిని కాపాడాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందని అన్నారు. తెలంగాణ కోసం జైలుకు వెళ్లిన ఉద్యమకారుల కోసం ప్రభుత్వం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో 20 శాతం ఉద్యమకారులకు కేటాయించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు గోవిందరావు, అంజియాదవ్‌, రాయల వెంకటేశ్వర్లు, నరసింహచారి, కృష్ణ, శ్రీనివాస్‌, మధు పాల్గొన్నారు.

గెజిటెడ్‌ హెచ్‌ఎంలకు ఘన సన్మానం


గెజిటెడ్‌ హెచ్‌ఎంలను సన్మానిస్తున్న రాష్ట్ర ఐక్య ఫెడరేషన్‌ ఉపాధ్యాయులు

చిలుకూరు : వివిధ ప్రాంతాల్లోని పాఠశాలల్లో స్కూల్‌ అసిస్టెంట్‌లుగా విధులు నిర్వర్తించి గెజిటెడ్‌ ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతి పొంది చిలుకూరు మండలానికి బదిలీపై వచ్చిన జనపనేని రామారావు, మాగి గురవయ్య, కె.రామిరెడ్డిలను శుక్రవారం చిలుకూరు మండల కేంద్రంలో ఐక్య రాష్ట్ర ఫెడరేషన్‌ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి ఐక్య ఫెడరేషన్‌ కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఐక్య ఫెడరేషన్‌ జిల్లా ఆడిట్‌ కమిటీ సభ్యులు అచ్యుత జనార్దన్‌రావు, చిలుకూరు మండల అధ్యక్ష, కార్యదర్శులు అన్నెపంగు బచ్చయ్య, నక్కా శ్రీనివాస్‌, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

న్యాయం చేయాలని తహసీల్దార్‌కు వినతి


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న బాధిత రైతు

చిలుకూరు : మండలంలోని చెన్నారిగూడెం గ్రామ శివారులో చెరువు దగ్గర (బండ వద్ద) తమ భూమిని కొందరు ఆక్రమించి మట్టి పోసేందుకు యత్నిస్తున్నారని తక్షణమే పరిశీలించి వారిపై చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని రైతు కొండయ్య శుక్రవారం తహసీల్దార్‌ ధృవకుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బాధిత రైతు మాట్లాడుతూ.. తమకు తెలంగాణ ప్రభుత్వం జారీ చేసిన పట్టాదారు పాస్‌బుక్‌ ఉందని తెలిపారు. కానీ గ్రామానికి చెందిన కొందరు కావాలనే వివాదం చేస్తున్నారని, విచారణ చేసి తమకు తగు న్యాయం చేయాలని కోరారు. విచారణ జరుపుతామని తహసీల్దార్‌ బాధిత రైతుకు హామీ ఇచ్చారు.

సీజనల్‌ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి


బిల్యానాయక్‌తండాలో గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

మఠంపల్లి : సీజనల్‌ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల గణాంకాధికారి, గ్రామ స్పెషల్‌ ఆఫీసర్‌ అశోక్‌ అన్నారు. శుక్రవారం మఠంపల్లి మండలంలోని బిల్యానాయక్‌తండా, చౌటపల్లి, కామంచికుంటతండా తదితర గ్రామాల్లో ప్రజలకు సీజనల్‌ వ్యాధులు దరిచేరకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గ్రామస్తులకు అధికారులు, హెల్త్‌ సిబ్బంది అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు ఇంటి పరిసరాల్లో మురుగునీరు నిల్వ ఉండకుండా పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శులు చంటి, సరిత, కవిత, ఏఎన్‌ఎంలు సైదమ్మ, మాదవి, కోటేశ్వరి, ఆశాలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

నేటి నుంచి బంగారుమైసమ్మ, యల్లమ్మ జాతర

నడిగూడెం : మండల పరిధిలోని రామాపురంలో బంగారు మైసమ్మ, యల్లమ్మ ఆలయాల వద్ద శనివారం నుంచి రెండు రోజుల పాటు జాతర జరగనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు మందుల రాంబాబు, కోశాధికారి నేలమర్రి శ్యామ్‌ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

మునగాల : మండలంలోని ముకుందాపురం గ్రామ పంచాయతీ శివారులో గల ఇందిర అనాథ వృద్ధాశ్రమంలోని వృద్ధులు, అనాథలకు శుక్రవారం కోదాడ పట్టణానికి చెందిన ఇంటూరి కొండయ్య- అనిత దంపతుల వివాహ వార్షికోత్సవం సందర్భంగా అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జ్యోతి, ఆశ్రమ నిర్వాహకురాలు నాగిరెడ్డి విజయమ్మ, సిబ్బంది జ్యోతి పాల్గొన్నారు.

నేడు విద్యుత్‌ సరఫరాలో అంతరాయం

హుజూర్‌నగర్‌ (చింతలపాలెం) : చింతలపాలెం మండలంలోని దొండపాడు ఫీడర్‌ లైన్‌లో విద్యుత్‌ మరమ్మతులు చేపడుతున్నందున దొండపాడులో శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్‌ సరఫరాలో అంతరాయం కలుగుతుందని విద్యుత్‌ ఏఈ హారిక శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్‌ వినియోగదారులు సహకరించాలని ఆమె కోరారు.

ప్రభుత్వ భూములను కాపాడాలి

మేళ్లచెరువు : ఉమ్మడి మేళ్లచెరువు మండలంలోని ప్రభుత్వ భూములను కాపాడాలని డీవైఎఫ్‌ఐ మండల కార్యదర్శి భావన ఆదినారాయణ ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన డీవైఎఫ్‌ఐ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ భూములు, ఫారెస్టు, చెరువులను అధికార పార్టీ నాయకులు, వారి అనుచరులు కబ్జా చేస్తున్నారని ఆరోపించారు. దళితులు, పేదల భూములను లాక్కునే ప్రయత్నం చేస్తున్నారన్నారు. పేదలకు పంచాల్సిన భూములను పంచకుండా అడ్డుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి దళితులు, గిరిజనులు, పేదల భూములను గుర్తించి వారికి అందేలా చూడాలని డిమాండ్‌ చేశారు. లేని పక్షంలో డీవైఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.

దాతల సహకారం అభినందనీయం

గరిడేపల్లి : మండల పరిధిలోని అబ్బిరెడ్డిగూడెం ప్రాథమిక పాఠశాలలో శ్రీకాంత్‌ చారిటబుల్‌ ట్రస్ట్‌ తరఫున పాస్టర్‌ శ్రీకాంత్‌ విద్యార్థులకు శుక్రవారం 45 పలకలు, నోట్‌ పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు వై.సైదిరెడ్డి మాట్లాడుతూ.. పేద విద్యార్థుల విద్యాభివృద్ధి కోసం దాతలు సహకారం అందించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌ చిలక కాశయ్య, అంగన్‌వాడీ టీచర్‌ ఉష, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీని నిర్వీర్యం చేసేందుకు కుట్ర

నేరేడుచర్ల : ఉపాధి హామీ చట్టం పరిరక్షణకు ఉద్యమం బాట పట్టాల్సిన సమయం ఆసన్నమైందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దూళిపాల ధనుంజయనాయుడు అన్నారు. శుక్రవారం నేరేడుచర్ల మండలం బోడలదిన్న గ్రామంలో జరుగుతున్న జాతీయ ఉపాధి హామీ పనులను ఆయన పరిశీలించి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు కుట్ర పన్నుతుందని ఆరోపించారు. ఆయన వెంట వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రావుల సత్యం, సీపీఐ మండల కార్యదర్శి యల్లబోయిన సింహాద్రి, పార్టీ పట్టణ కార్యదర్శి కత్తి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలి

హుజూర్‌నగర్‌ : అధిక ఫీజులు వసూలు చేస్తున్న విద్యా సంస్థలపై అధికారులు చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.చందర్‌రావు కోరారు. ఈమేరకు శనివారం హుజూర్‌నగర్‌లో ఎంఈఓ సైదానాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠ్యపుస్తకాలు, యూనిఫాం, షూ, నోట్‌ బుక్స్‌, స్టేషనరీ అమ్ముతున్న విద్యాసంస్థల్లో తనిఖీలు చేపట్టి చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించిన విద్యాసంస్థలపై క్రిమినల్‌ కేసులు నమోదు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు ఉదయ్‌, ప్రవీణ్‌, నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.